దుర్శేడ్ గ్రామ పంచాయతీకి మున్సిపల్ బోర్డును ఏర్పాటు చేస్తున్న అధికారులు

విలీన ప్రక్రియ వేగవంతం

- ఆయా జీపీలు, మున్సిపల్ రికార్డుల స్వాధీనానికి అధికారుల నియామకం
- వచ్చే నెల 6లోగా విలీనం పూర్తి చేసేందుకు కసరత్తు

కార్పొరేషన్, జనవరి 29: విలీన గ్రామాలు, కొత్తపల్లి మున్సిపాలిటీని పూర్తి స్థాయిలో కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోకి తీసుకువచ్చే ప్రక్రియ వేగవంతమైంది. సీడీఎంఏ ఈ కార్యక్రమాన్ని వచ్చే నెల 6లోగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో నగరపాలక అధికారులు దీనికి సంబంధించి చర్యలు ప్రారంభించారు. కొత్తపల్లి మున్సిపాలిటీతో పాటు గ్రామాల్లోని అధికారుల నుంచి ఆయా రికార్డులను స్వాధీనం చేసుకోవడానికి నగర కమిషనర్ బల్దియాలోని వివిధ విభాగాల అధికారులకు బాధ్యతలు అప్పగించారు. వీరు ఆయా గ్రామాల్లో ప్రత్యేకాధికారుల నుంచి ఆ గ్రామాలకు సంబంధించిన రికార్డులు స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి సీడీఎంఏకు నివేదికను పంపించేందుకు నగరపాలక అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం నుంచే రికార్డుల స్వాధీనం ప్రక్రియ చేపట్టారు. ఈ క్రమంలో కొత్తపల్లి మున్సిపాలిటీకి సంబంధించి డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి, చింతకుంట గ్రామానికి అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, మల్కాపూర్, లక్ష్మీపూర్‌కు సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, బొమ్మకల్‌కు ఇన్‌చార్జి ఏసీపీ వేణు, దుర్శేడ్‌కు సూపరింటెండెంట్ సంజీవ్‌కుమార్, గోపాల్‌పూర్‌కు డీఈ వెంకటేశ్వర్లకు బాధ్యతలు అప్పగించారు. వీరు మున్సిపల్, ఆయా గ్రామాల పంచాయతీలకు వెళ్లి అక్కడి ప్రత్యేకాధికారుల నుంచి పూర్తిస్థాయిలో రికార్డులను స్వాధీనం చేసుకుంటున్నారు. రెండు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి అన్ని రికార్డులను మున్సిపాలిటీకి అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు. విలీన పక్రియ పూర్తి అయిన తర్వాత పూర్తి వివరాలతో వచ్చే నెల 6లోగా సీడీఎంఏకు నివేదిక అందించనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

వార్డు కార్యాలయాలుగా.. జీపీలు

కరీంనగర్ రూరల్, జనవరి 29: కరీంనగర్ మండలం బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామాలను కరీంనగర్ నగరపాలక సంస్థలో విలీనం కాగా, బుధవారం నగరపాలక అధికారులు ఆయా జీపీల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలకు నగరపాలక సంస్థ వార్డు కార్యాలయాలుగా బోర్డులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ మండల పంచాయతీ అధికారి జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఆనందహేల

- దళిత బంధు రెండో విడుత నిధులపై ఫ్రీజింగ్ ఎత్తివేయడంపై సంబురాలు
- ఎమ్మెల్యే ఫ్లెక్సీకి క్షీరాభిషేకాలు

జమ్మికుంట: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసిన దళిత బంధు లబ్ధిదారులు

జమ్మికుంట/హుజూరాబాద్ టౌన్, జనవరి 29: నిత్య పోరాటాలతో ప్రభుత్వం దిగొచ్చి దళిత బంధు రెండో విడుత నిధులపై ఫ్రీజింగ్ ఎత్తివేయడంపై లబ్ధిదారులు, బీఆర్ఎస్ నాయకులు ఆనందపడ్డారు. బుధవారం హుజూరాబాద్ నియోజకవర్గంలో సంబురాలు జరుపుకొన్నారు. జమ్మికుంటలోని తెలంగాణ చౌక్ వద్ద దళిత సంఘం నాయకుడు మంద రాజేశ్ ఆధ్వర్యంలో 'దళిత బంధు'వులు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అలాగే హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కౌశిక్ రెడ్డి ఫ్లెక్సీకి బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఆయాచోట్ల నాయకులు మాట్లాడారు. 'దళిత బంధు' ద్వారా దళిత కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపింది తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అయితే.. దళిత కుటుంబాల పక్షాన దళిత బంధు పథకం రెండో విడుత నిధులు విడులయ్యేలా కొట్లాడిన ఘనత ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దంటూ కొనియాడారు. రెండో విడుత విడుదలయ్యేంత వరకు దళితుల పక్షాన నిలబడిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. జమ్మికుంటలో నాయకులు రాచపల్లి అనిల్, రాం చంద్ర మౌళి, చారపల్లి రాకేశ్, బండారి ప్రశాంత్, పాత రాజేశ్, గుల్లి ప్రభాకర్, కొత్తూరు విజయ్, గణపతి, ఎర్ర రాజేశ్, ప్రశాంత్, రాజు ఉన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు ముక్క రమేశ్, మారెపల్లి సుశీల, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మొలుగు పూర్ణచందర్, కేసరి మధుకర్ రావు, మోతె మధు, ఎర్రశ్రీధర్, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని వినతి

కరీంనగర్ రూరల్, జనవరి 29: ప్రభుత్వం నుంచి తక్షణమే పెండింగ్‌లో ఉన్న తమ జీతాలు ఇప్పించాలని కరీంనగర్ మండల ఉపాధిహామీ సిబ్బంది బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సంజీవరావుకు వినతి పత్రం అందజేశారు. మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం ఇచ్చినవారిలో ఉపాధిహామీ టెక్నీషియన్లు, ఏపీవో శోభరాణి, పద్మ, తదితరులు ఉన్నారు.

భూసేకరణపై గ్రామ సభలు

చిగురుమామిడి, జనవరి 29: గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల కింద భూములు సేకరిస్తున్న బొమ్మనపల్లి, సుందరగిరి, ఉల్లంపల్లి, కొండాపూర్ గ్రామాల్లో బుధవారం కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, ఎస్డీసీ కిరణ్ ప్రకాశ్ వేర్వేరుగా గ్రామ సభలు నిర్వహించారు. గౌరవెల్లి రిజర్వాయర్ కాలువల ద్వారా భూములు కోల్పోతున్న రైతులకు ఏమైనా అభ్యంతరాలు, సందేహాలు ఉంటే గ్రామ సభలో తెలియజేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రైతులను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, డిప్యూటీ తహసీల్దార్ స్వరూపారాణి, ఆర్ఐలు అరుణ్ కుమార్, తారామణి, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీలు, టీవీ, ప్రింటర్ వితరణ

పాఠశాలకు సామగ్రిని వితరణ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

హుజూరాబాద్ రూరల్, జనవరి 29: హుజూరాబాద్ మండలం సిర్సపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదామా పెట్టిపైప్స్, నిర్మాణ్ ఎన్జీవో సంస్థ ఆధ్వర్వంలో రూ.4 లక్షల విలువైన వస్తు సామగ్రిని అందించి, ఉదారత చాటుకున్నారు. విద్యార్థులు కూర్చోవడానికి 40 డ్యూయల్ డెస్క్ బెంచీలు, స్మార్ట్ క్లాస్ ప్యానెల్ టీవీ, ప్రింటర్, ఐదు ఎస్ టైప్ కుర్చీలను బుధవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా అదామా కంపెనీ ప్రతినిధి సౌత్ ఇండియా సేల్స్ మేనేజర్ పాపు నాయుడు మాట్లాడుతూ.. తమ సంస్థ రైతుల శ్రేయస్సే కాకుండా, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో ముందుంటుందని తెలిపారు. విద్యార్థులకు చేయూతనందించిన అదామా సంస్థకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విడపు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సంపత్, పాఠశాల ఏఏపీసీ చైర్‌పర్సన్ గంగా, పీఏస్‌హెచ్ఎం రజిని, ఏఈవో సతీశ్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి, అదామా కంపెనీ ప్రతినిధి ప్రకాశ్, తూముల చక్రధర్ రావు, మనోహర్, పాఠశాల శాశ్వత దాతలు గసిరెడ్డి సదాశివ రెడ్డి, వంగల వెంకట రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు ఎడ్ల విజయ్ కుమార్, తక్కల్లపల్లి వెంకట్రావు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేషనల్ లెవెల్ పోటీలకు సైనిక పాఠశాల విద్యార్థి

చొప్పదండి, జనవరి 29: మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక పాఠశాల రుక్మాపూర్‌కు చెందిన 12వ గ్రేడ్ విద్యార్థి మాస్టర్ కె.బలరాం నేషనల్ లెవెల్ టెన్నీకాయిట్ జూనియర్ చాంపియన్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ కల్నల్ కేసీ రావు, ప్రిన్సిపాల్ కాళహస్తి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లోని సెయింట్ అల్ఫోన్స్ పాఠశాలలో జరిగిన టెన్నీకాయిట్ రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి, ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 3 వరకు చెన్నైలో జరిగే నేషనల్ లెవెల్ టెన్నీకాయిట్ జూనియర్ చాంపియన్ షిప్‌కు కె.బలరాం అర్హత సాధించాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్‌తో పాటు ఎస్‌వీపీ శ్రీనివాస్, జేవీపీ ప్రమోద్ రాజు, పీడీ ఇనాక్ బాలసుందర్‌రావు, పీఈటీ విక్రమ్, సిబ్బంది అభినందించారు.

చదువుతోనే పేదరికం దూరం

మాట్లాడుతున్న నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్

కలెక్టరేట్, జనవరి 29 : ముస్లింలంతా ఉన్నత విద్యావంతులైతే పేదరికంలో మగ్గుతున్న వారి కుటుంబాలు బాగుపడుతాయని నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ తెలిపారు. ఈ భావనతోనే ముస్లిం విద్యార్థులకు గైడ్లు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తూ, నిరుపేదలకు ఉచిత విద్యనందిస్తున్నట్లు గుర్తు చేశారు. బుధవారం నగరంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయం దారుసలాంలో ముస్లిం విద్యార్థులకు సలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ 2025 గైడ్లు పంపిణీ చేశారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ముస్లిం కుటుంబాల్లోని పిల్లలు కష్టపడి చదివి తమ తల్లిదండ్రుల పేరు నిలపాలని, ఉన్నత చదువులతో అత్యున్నత శిఖరాలకు చేరాలని సూచించారు. ఆ పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ, సలారే మిల్లత్ గైడ్లు వినియోగించిన అనేక మంది విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. అనంతరం నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ముస్లిం విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ గైడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆపార్టీ నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీలు హఫీజ్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్, ఖమ్రుద్దీన్, అబ్బాస్ షమీ, ఇబ్రహీం, అతిన, ఖాజా, అఖిల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, అజర్ దబీర్, సర్వర్‌షా బియాబానీ, షాకీర్ నహ్ది, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు

కలెక్టరేట్, జనవరి 29 : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి వి.శ్రీధర్ తెలిపారు. అపోలో ఫార్మసీ సంస్థలో ఫార్మాసిస్టు, ఫార్మసీ అసిస్టెంటు పోస్టులు వంద ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు. ఫార్మాసిస్టుకు డీఫార్మసీ, బీఫార్మసీ, ఎంఫార్మసీల్లో ఏదేని అర్హత కలిగి ఉండాలని, వేతనం రూ.25 వేల వరకు ఉంటుందని, ఫార్మసీ అసిస్టెంట్ పోస్టులకు డిగ్రీ వరకు చదివి ఉండాలని, వారికి రూ.20 వేల వరకు వేతనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు గల ఔత్సాహికులు ఈనెల 31న నగరంలోని స్వశక్తి కళాశాల ఆవరణలో గల ఈజీఎంఎం కార్యాలయంలో ఉదయం 10 గంటలకు తమ బయోడేటా, ఆధార్‌కార్డు, విద్యార్హతల జిరాక్సు ప్రతులతో హాజరుకావాలని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలి

తెలంగాణచౌక్, జనవరి 29 : ఈ నెల 31న నగరంలో నిర్వహిస్తున్న గద్దర్ 77వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని గద్దర్ గళం జిల్లా నాయకుడు గజ్జెల స్వామి పిలుపునిచ్చారు. నగరంలోని కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ, గద్దర్ ప్రజా యుద్ధనౌక అని, అణగారిన వర్గాల హక్కుల కోసం గజ్జె కట్టి ఆటపాటలతో పోరాడారని పేర్కొన్నారు. కోట్లాది మంది ప్రజల మనుస్సులో నిలిచిపోయారని కొనియాడారు. అలాంటి వ్యక్తిపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వాటిని బండి వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గద్దర్ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గద్దర్ గళం జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గద్దర్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ

వీణవంక, జనవరి 29: మండలంలోని చల్లూరు, మామిడాలపల్లి గ్రామాల్లో బుధవారం గద్దర్ జయంతి సభ పోస్టర్‌ను అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాకారులు మాట్లాడుతూ, ఈ నెల 31న గద్దర్ జయంతిని పురస్కరించుకొని అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి ఆధ్వర్యంలో గణేశ్ కళాబృందం గద్దరన్నసభ, గద్దరన్న అవార్డుల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు తాండ్ర శంకర్, పుల్లూరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గూడెపు సమ్మయ్య, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గొనెల సమ్మన్న, ప్రధాన కార్యదర్శి ముద్దసాని శ్రీనివాస్, చంద్రమౌళి, శ్రీనివాస్, సుధాకర్, వెంకటస్వామి, మహేశ్, గొనెల పెద్దన్న, మురళి తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయకపోతే ఆందోళన తప్పదు

తెలంగాణచౌక్, జనవరి 29: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొంకూరి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో బుధవారం జిల్లా కమిటీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్మిక శాఖ అధికారులు కార్మిక సంఘాల నాయకులతో చర్చించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేకపోతే కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు లక్ష్మణ్, శ్రీనివాస్, శంకరయ్య, బాబు పాల్గొన్నారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ నూతన కార్యవర్గం

శంకరపట్నం, జనవరి 29: ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తిరిగి చౌడమల్ల సంపత్, ప్రధాన కార్యదర్శిగా బొంగోని కుమార్, కోశాధికారిగా మొలుగూరి రమేశ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా గోరేమియా, మనోచారి, సహాయ కార్యదర్శిగా సుద్దాల కుమార్, డీ ప్రకాశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాచర్ల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులుగా ఎండీ అజీమ్, గుర్రం వాసు, సలహాదారుగా గాజుల స్వామి, కార్యవర్గ సభ్యులుగా పూదరి తిరుపతి, వంగ శ్రీనివాస్, నేదురు శ్రీనివాస్, జినుక కుమార్, బత్తుల శ్రీకాంత్, కాంతాల విజేందర్‌రెడ్డి, తీగల శ్రీనివాస్, మ్యాకల కుమార్, శనిగరం మహేశ్, ఎం ప్రసాద్‌ను ఎన్నుకున్నారు.

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌పై కేసు నమోదు చేయాలి

తెలంగాణచౌక్, జనవరి 29: ట్రాఫిక్ ఏసీపీ మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ మీద ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంకటి శేఖర్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్టీపీసీలో ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్తున్న మక్కాన్‌సింగ్ విధినిర్వహణలో ఉన్న ట్రాఫిక్ ఏసీపీని దూషించడాన్ని ఖండించారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌తో పాటు కాంగ్రెస్ కార్యకర్తలపై కూడా ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

మైనార్టీ పాఠశాలలో 'బాయ్స్ ఫర్ చేంజ్'

కరీంనగర్ రూరల్, జనవరి 29: బొమ్మకల్‌లోని తెలంగాణ మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల బాలురలో వాయిస్ ఫర్ గర్ల్స్ సంస్థ ప్రత్యేక టీం ఆధ్వర్యంలో బాయ్స్ ఫర్ చేంజ్ అనే 10 రోజులు ప్రత్యేక శిబిరం ప్రారంభించారు. ఈ శిబిరంలో భాగంగా 7, 8వ తరగతి విద్యార్థుల మానసిక ఆరోగ్యం, కౌమారదశలో శరీరంలో వచ్చే మార్పులు, సామాజిక పరిస్థితులపై అవగాహన కల్పిస్తారని, ఈ శిక్షణ వారి భవిష్యత్తుకు ఉపకరిస్తుందని స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్ మహేశ్ తెలిపారు.

జాతీయ సమైక్యత శిబిరానికి వివేకానంద విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కమాన్‌చౌరస్తా, జనవరి 29 : జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్స్ సార్వ లావణ్య, కక్కెర్ల సాయిరాం జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. వచ్చేనెల 11 నుంచి 17 వరకు కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో జరిగే శిబిరానికి వలంటీర్లు హాజరవుతారని కాలేజ్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనపురి సాగర్ చెప్పారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లను కళాశాల కరస్పాండెంట్ వి. ఆగంరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఏసీవో బీ సంపత్ కుమార్, ఏవో బీ శ్రవణ్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ధనపురి సాగర్, బీ మహేశ్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

జిల్లా వసతి గృహ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం


టీఎన్జీవో నాయకులతో జిల్లా వసతి గృహ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

కొత్తపల్లి, జనవరి 29 : టీఎన్జీవో అనుబంధ జిల్లా వసతి గృహ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నగరంలోని టీఎన్జీవో భవన్‌లో బుధవారం నిర్వహించిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా బోనాల రవి, కార్యదర్శిగా సూర తిరుపతిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎ. సత్యనారాయణ, ట్రెజరర్‌గా హసీనా బేగం, వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్ సత్యనారాయణ, ఎ. రజిత, కె. జయకుసుమాకర్‌రావు, వి. రేవ, జాయింట్ సెక్రటరీలుగా బి. రవీందర్, జి. రాజశేఖర్, ఇ. శ్రీదేవి, డి. విజయలక్ష్మి, ఆఫీస్ సెక్రటరీగా బి. కృపవరం, స్పోర్ట్స్ సెక్రటరీగా జి. కిషన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె. సంపత్‌కుమార్, పబ్లిసిటి సెక్రటరీగా ఎన్. పరమేశ్, ఈసీ మెంబర్లుగా జి. నాగరాజు, ఎం. లచ్చమ్మ ఎన్నికయ్యారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దారం శ్రీనివాస్‌రెడ్డి, సంగెం లక్ష్మణరావు, వసతి గృహ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ గౌస్ హస్మి ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరుగగా, ఎన్నికల అధికారిగా కిరణ్‌కుమార్‌రెడ్డి, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా సర్దార్ హర్మీందర్‌సింగ్ వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

సోలార్ పవర్ ప్లాంట్‌కు స్థల పరిశీలన

చిగురుమామిడి, జనవరి 29: మండలంలోని ఉల్లంపల్లి, కొండాపూర్ గ్రామాల్లో ప్రధాన మంత్రి కుసుం కార్యక్రమంలో భాగంగా సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం డీఆర్డీవో శ్రీధర్ బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ భూమి వివరాలు, పరిసర ప్రాంతాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో మధుసూదన్, సెర్ప్ డీపీఎం ప్రవీణ్, ఏపీఎం సంపత్, ఆర్ఐ అరుణ్ కుమార్, సర్వేయర్ మురళీకృష్ణ, సీసీ వెంకటమల్లు తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

వాస్తు చూడబడును

★వాస్తు చూడటం, ఇంటి మోడల్ ప్లానులు తీయడం, భూమి కొలతలు తీయడం,ఆటోక్యాడ్‌లో డ్రాయింగ్ చేయడం నేర్పబడును, వాస్తు చూడబడును. సంప్ర|| M. రాజేష్, సెల్ : 9502438614
NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

నూతన నియామకం

గంగాధర, జనవరి 29: భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ సంఘం తెలంగాణ కన్‌స్ట్రక్షన్ మజ్దూర్ సంఘ్ జిల్లా కన్వీనర్‌గా మండలంలోని నాగిరెడ్డిపూర్ గ్రామానికి చెందిన మొగిలిపాలెం తిరుపతిని నియమిస్తూ బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి తూర్పు రామ్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ, జిల్లాలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమం కోసం పని చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన సంఘం నాయకులు తిరుపతి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు

గంగాధర, జనవరి 29: మండలంలోని ఉప్పరమల్యాల ప్రభుత్వ పాఠశాల పద్ద రోడ్డు ఇరుకుగా మారి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. స్థానిక మాజీ సర్పంచ్ సముద్రాల అజయ్ విషయాన్ని ఇటీవల ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన అధికారులు కాంట్రాక్టర్‌ను ఆదేశించడంతో రోడ్డును విస్తరించి మరమ్మతులు చేశారు. సమస్యను వివరించగానే పరిష్కరించిన అధికారులకు అజయ్ కృతజ్ఞతలు తెలిపారు.

మహిళ మృతిపై వీడని మిస్టరీ

- నాలుగు రోజుల కింద మంచిర్యాలలో కారులో వెళ్లిన మమత
- కొండన్నపల్లిలో అనుమానాస్పద స్థితిలో మృతి
- లభించని ఆమె కొడుకు ధృవ ఆచూకీ

గంగాధర, జనవరి 29: కురిక్యాల కొండన్నపల్లి గ్రామాల మధ్య వరదకాలువ వద్ద మంచిర్యాలకు చెందిన మమత అనుమానాస్పద మృతిపై మిస్టరీ వీడడం లేదు. మంచిర్యాలకు చెందిన ఆమె, ఐదేళ్ల క్రితం భరత్ అనే వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకుందని, మనస్పర్థల కారణంగా వేరుగా తెలిసిన వారి ఇంటిలో ఉంటున్నట్లు తెలిసింది. వీరికి నాలుగేళ్ల కొడుకు ధృవ ఉన్నాడు. ఈ నెల 25న నూనె ప్యాకెట్లు తెస్తానని చెప్పి ఇంటి నుంచి తన కొడుకు ధృవతో బయటికి వెళ్లిన మమత, 27న కొండన్న పల్లి వరదకాలువ వద్ద వద్ద శవమై కనిపించింది. కాగా, అనుమానాస్పద మృతిగా గంగాధర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాపు చేస్తున్నారు. అయితే 25న మంచిర్యాలలో గుర్తు తెలియని కారు ఎక్కి వెళ్లినట్లు సీసీ కెమెరాలో రికార్డైంది. ఆ కారు ఎవరిది..? ఆమె ఎవరితో కలిసి ప్రయాణించింది..?, ఎలా చనిపోయింది..? మృతదేహం వరదకాలువ వద్ద ఎందుకు ఉంది..? ఆమె కొడుకు ఏమైనట్లు అన్న విషయాలు మిస్టరీగా మిగిలాయి. బుధవారం కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో మమత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దర్యాప్తును ముమ్మరం చేశామని, అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

మున్సిపల్ మాజీ కౌన్సిలర్లను సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

మాజీ కౌన్సిలర్లకు సన్మానం

హుజూరాబాద్ టౌన్, జనవరి 29: హుజూరాబాద్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాజా మాజీ బల్దియా పాలకవర్గ సభ్యులకు బుధవారం ఘనంగా సన్మానం నిర్వహించారు. ముందుగా పురపాలక సంఘం తాజా మాజ